జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక


చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

మంగళవారం | 1-7-2025 శ్రీకాకుళం సంపుటి: 2 సంచిక: 384 పేజీలు: 4 వెల : రూ.7




# కానిస్టేబుల్‌కు.. టోకరా!

* బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ ఇప్పిస్తానని రూ.36వేలు డిమాండ్
* రూ.21వేలు ఇచ్చిన వెంటనే ప్లాన్ అప్రూవల్ చేసిన టౌన్‌ప్లానింగ్ సిబ్బంది
* అది కూడా తప్పుడు ప్లాన్
* లబోదిబోమంటున్న పోలీస్ కానిస్టేబుల్
* ఏజెంట్లను పెట్టుకుని దందా సాగిస్తున్న కొందరు సిబ్బంది
* కొందరు టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు
* కమిషనర్ పట్టించుకోవడం లేదంటున్న బాధితులు

**శ్రీకాకుళం క్రైం, జూన్ 30 (వార్త):** నగరపాలక సంస్థలో కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది తీరు విమర్శలకు తావిస్తోంది. రోజురోజుకూ వారి ఆగడాలు మితిమీరిపోతున్నాయి. ఎవరైనా ఇల్లు కట్టుకుంటామని ప్లాన్ అప్రూవల్‌కు దరఖాస్తు చేస్తే చాలు.. ఆ స్థలం విషయంలో ఎక్కడా లేనివిధంగా తప్పులు ఎత్తిచూపి, కార్యాలయం చుట్టూ తిప్పుకుని, ముప్పుతిప్పలు పెట్టి, వారి నుంచి ఎంతోకొంత దండుకుని.. చివరకు ప్లాన్ అప్రూవల్ ఇస్తున్నారు. వీరు కొందరు ఏజెంట్లను పెట్టుకుని నాటకాన్ని తెరకెక్కిస్తున్నారు. ఎవరైనా వీరు అడిగింది ఇవ్వకపోతే భవన నిర్మాణాలను కూల్చేందుకు సైతం వెనుకాడడం లేదు. అయితే ఈ నాటకాన్ని మొత్తం కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది.. ఏజెంట్లను ముందుపెట్టి వెనుకనుంచి నాటకాన్ని రసవత్తరంగా నడిపిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. శ్రీకాకుళం నగరానికి చెందిన ఓ కానిస్టేబుల్‌ను ముప్పుతిప్పలు పెట్టించి, ఏకంగా రూ.21వేలు తీసుకుని ఇంటి నిర్మాణానికి ప్లాన్ అప్రూవల్ ఇచ్చారు. ఆ ప్లాన్ అప్రూవల్ కూడా తప్పుగా ఉండడంతో ఆ కానిస్టేబుల్ లబోదిబోమంటున్నారు. డబ్బులు పోయి.. తప్పుడు ప్లాన్ ఇవ్వడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక, భవన నిర్మాణం చేపట్టలేక నానాఅవస్థలు పడుతున్నారు. కానిస్టేబుల్ అని చెప్పినా తనవద్దే ముక్కుపిండి డబ్బులు వసూలు చేశారని, సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కానిస్టేబుల్ శ్రీకాకుళం నగరంలోని పాత రవీంద్రభారతి స్కూల్ సమీపంలో తన స్థలంలో భవన నిర్మాణానికి పూనుకున్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ఇంటి నిర్మాణ ప్లాన్ కోసం దరఖాస్తు చేశారు. నెలలు గడుస్తున్నా ప్లాన్ రాకపోవడంతో తనకు తెలిసిన వ్యక్తి సూచనల మేరకు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది చెప్పిన ఓ ఏజెంట్‌ను కలిశాడు. ప్లాన్ అప్రూవల్ వేగంగా కావాలంటే రూ.36వేలు ఇవ్వాలని ఏజెంట్ చెప్పడంతో చివరకు కానిస్టేబుల్ రూ.21వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్రభుత్వ చలానా కింద రూ.51వేలు వరకూ కట్టారు. అయినప్పటికీ ప్లాన్ అప్రూవల్ ఆలస్యం చేశారు. దీంతో ఆ కానిస్టేబుల్ రూ.21వేలు ఇచ్చిన వెంటనే ఇంటినిర్మాణానికి సంబంధించిన ప్లాన్ అప్రూవల్ అయింది. నగరపాలక సంస్థలోని టౌన్‌ప్లానింగ్ లోని కొందరు అధికారులు, సిబ్బంది తంతుపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏసీబీ అధికారులు నగరపాలక సంస్థపై ఓ కన్నేస్తే తప్ప సామాన్యులకు న్యాయం జరగదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

## వరహా అవతారంలో జగన్నాథుడు

**శ్రీకాకుళం, జూన్ 30 (వార్త):** జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా నగరంలోని ఇల్లిసిపురంలోని గుండిచా మందిరంలో జగన్నాథ, బలభద్ర, సుభద్రా దేవిలు వరహా అవతారంలో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి విశేష అలంకరణలు చేసిన అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సుభాష్ చంద్ర పండా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు బాలు పాణిగ్రాహి ఏర్పాట్లు చేశారు.





## మా పాఠశాలను తరలించొద్దు

* ధర్నా చేసిన భగవాన్‌దాస్‌పేట పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు

**పొందూరు/శ్రీకాకుళం క్రైం. జూన్ 30 (వార్త):** మా పాఠశాలను తరలించొద్దంటూ నందివాడ పంచాయతీ భగవాన్‌దాస్‌పేట పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం ధర్నాకు దిగారు. ఉపాధ్యాయులు పాఠశాలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ పాఠశాలను నరసాపురం మోడల్ ప్రైమరీ స్కూల్‌లో విలీనం చేస్తూ విద్యాశాఖాధికారులు ఉత్తర్వులు ఇవ్వడాన్ని నిరసిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఇక్కడి పాఠశాలలో 27 మంది చదువుతున్నారని, దీన్ని ఏవిధంగా మరో పాఠశాలలో విలీనం చేస్తారని ప్రశ్నించారు. ప్లకార్డులు ప్రదర్శించి నిరసన కార్యక్రమాన్ని కొనసాగింది. తమ విద్యార్థులను పాఠశాలకు పంపేది లేదంటూ తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. రాజాం-చిలకపాలెం వెళ్లే రహదారిలో నిత్యం పెద్ద ఎత్తున వాహనాలు వెళుతుంటాయని, తమ పిల్లలకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. అనంతరం ఎంఈవోకు వినతిపత్రాన్ని అందజేశారు. కాగా, జిల్లాలో పలు పాఠశాలల విలీనంపై విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థుల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాల విలీనంపై మరోసారి నిర్ణయం తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు


**మందస, జూన్ 30(వార్త):** పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెలు, మేకల్లో నట్టల నివారణ కార్యక్రమం నిర్వహిస్తోందని మందస, హరిపురం పశువైద్యాధికారులు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ కె.ఉమాభారతి తెలిపారు. వర్షాలు కురుస్తుండడంతో వివిధ వ్యాధులు సంక్రమించే అవకాశాలు ఉన్నాయన్నారు. వీటిని నియంత్రించేందుకు నట్టల నివారణ తప్పనిసరన్నారు. ప్రస్తుతం పంపిణీ చేస్తున్న మందును సన్నజీవాల పెంపకదారులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రం ద్వారా ఈ మందులు ఉచితంగా పొందవచ్చని సూచించారు.



# వినతులకు పరిష్కారం చూపాలి

**-కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**-ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 110 అర్జీలు**



**పలాస, జూన్ 30(వార్త):** ప్రజల నుంచి అందిన వినతులకు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. పలాస తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జడ్పీ సీఈవో ఎల్.ఎల్.శ్రీధర్‌రాజ్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ స్వీకరించారు. 110 అర్జీలు అందాయి. డివిజన్‌లోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు భూ సమ స్యలు, మ్యుటేషన్‌లు, రీ సర్వే సరిచేయాలని, సామాజిక పింఛన్లు మంజూరు చేయా లని అర్జీలు అందజేశారు. పలాస పోస్టుమెట్రిక్ బాలికల ఎస్టీ హాస్టల్ లో తాగునీటి ఇబ్బంది తీవ్రంగా ఉన్నందున సమస్య పరిష్కరించాలని, ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు రక్షణగా స్థానికంగా అందుబాటులో ఉండే వార్డెన్‌ను నియమించాలని విద్యా ర్థినులు ఎస్.ఊర్మిళ, కుంతీదేవి, సుస్మితతో పాటు పలువురు వినతిపత్రం సమ ర్పించారు. పురుషోత్తపురం ఎర్ర చెరువు ఆక్రమణలకు గురైనందున పూర్తిస్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సప్ప నవీన్ కుమార్, కె.శంకర్‌రావు అర్జీ అందజేశారు. గ్రామానికి తాగునీరు, శ్మశానవాటిక నిర్మించాలని మెళియాపుట్టికి చెందిన సేనాపతి రవికుమార్ కోరారు. కిడ్నీ థెరపీ యూనిట్ మంజూరు చేయాలని వజ్రపుకొత్తూరుకు చెందిన కీలు విజయకుమార్ దరఖాస్తు అందించారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నష్టపరిహారం మంజూరు చేయాలని మెళియాపుట్టి మండలం మనిగాం గ్రామానికి చెందిన మనిగాం చిలకయ్య విజ్ఞప్తి చేశారు. గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాల రక్షణ గోడ నిర్మాణం చేపట్టాలని సవర గోవిందపురం గ్రామానికి చెందిన సవర పవన్ దరఖాస్తు సమర్పించారు. గ్రామంలో నిర్వహించిన రీసర్వేలోని తప్పులను సరిచేయాలని పలాసకు చెందిన ఏ. రామారావు కోరారు. కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధాకర్, ఆర్డీవో జి.వెంకటేష్, డిప్యూటీ డీఎంహెచ్‌వో కళ్యాణ చక్రవర్తి, డివిజన్‌లోని తహసీల్దార్లు, డివిజన్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అధ్యాపకుడు భగవాన్‌కి ఘన సన్మానం

**కొత్తూరు, జూన్ 30(వార్త):** కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి, అదే కళాశాలలో చరిత్ర అధ్యాపకునిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన రేగు భగవాన్‌కు సోమవారం ఆ కళాశాలలో ఘన సన్మానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.ధనుంజయరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సన్మానించారు. తాను చదివిన కళాశాలలో పదవీ విరమణ పొందడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.

## 2న నియోజకవర్గ స్థాయి ఆటో ర్యాలీ

**ఇచ్ఛాపురం, జూన్ 30(వార్త):** ఆటోలకు ఎచ్చెర్లలో ఫిట్‌నెస్ చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 2న నియోజకవర్గ స్థాయిలో ఆటోలతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు భజరంగ్ నియోజకవర్గ ఆటో యూనియన్ తెలిపింది. తులసమ్మ గుడి నుంచి అమీన్ సాహెబ్ పేట వరకు ర్యాలీ నిర్వహిస్తామని చెప్పారు.

# జీడికి గిట్టుబాటు ధర కల్పించి.. ప్రభుత్వమే కొనాలి



**మందస, జూన్ 30(వార్త):** జీడి పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతాంగ సమస్యల సాధన కమిటీ నాయకులు కోరారు. పలాస తహసిల్దార్ ఆఫీసులో ఏర్పాటు చేసినటువంటి గ్రీవెన్స్ సందర్భంగా జిల్లా కలెక్టర్ ను రైతాంగ సమస్యల సాధన కమిటీ ఆధ్వర్యంలో నాయకులు ఒక వినతి పత్రం అందజేశారు. జీడి పంటకు సరైన గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలని, 80కేజీల జీడిపిక్కల బస్తా 16వేల రూపాయలకు కొనుగోలు చేసి, గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. పలాసలో జీడి బోర్డు ఏర్పాటు చేయాలని, వంశధార ఎడమ కాలువ ఇచ్ఛాపురం వరకు వయా బొడ్డపాడు వేపోడు చెరువు మీదుగా పొడిగించాలని ప్రధానమైన డిమాండ్లతో విన్నవించారు. రైతు సంఘం అధ్యక్షుడు మామిడి మాధవరావు, దాసరి శ్రీరాములు, తామాడ త్రిలోచన రావు, రాజాం గుణవంతు, మద్దిల ధర్మారావు, బొడ్డు సింహాద్రి, బత్తిని వాసుదేవ్, తామాడ రాజేశ్వరరావు, తామాడ గంగయ్య, కుతుం హేమలయ్య, బెస్త కామేశ్వరరావు, మార్పు మన్మధరావు, ధర్మాపు వెంకట్రావు, నల్ల హడ్డి, యు.సోమనాథం, వీరస్వామి, కొర్ల హేమరావుచౌదరి, దుంపల వైకుంఠరావు, కోర్నాని గంగాధర్, కొవ్వూరు దశరథ, గొర్రెల అంజి తదిత రైతులు పాల్గొన్నారు.

## గిరిజన రైతుల భూసమస్య శాశ్వత పరిష్కారం కాలేదు



**మందస, జూన్ 30(వార్త):** చీపి పంచాయతీలో బెత్తికోల గ్రామ గిరిజన రైతులు, బుడారిసింగి గిరిజన రైతుల భూసమస్యలు పరిష్కారం కాలేదని గిరిజన రైతులు గిరిజన ఐక్యవేదిక నాయకులు ఆరోపించారు. ఆయా ప్రాంతాల్లోని భూములను సోమవారం వారు పరిశీలించారు. బుడారిసింగి రెవెన్యూ పరిధిలోని భూములను సుమారు 60, 70సంవత్సరాల నుంచి గిరిజనులు సాగు చేస్తున్నారన్నారు. ఆ భూములను ను కొంత మంది బీసీలు తమవంటున్నారన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ రైతులంతా కలసి మందస తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశామన్నారు. ఈ ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు ఆ భూములపై సర్వే చేశారన్నారు. దీంతో కొన్ని పత్రికల్లో సాగులో ఉన్న గిరిజన రైతులకు శాశ్వత పరిష్కారమైనట్లు వచ్చిన కథనాలను వారు ఖండించారు. సాగులో ఉన్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మందస శాఖ గిరిజన ఐక్యవేదిక మండల అధ్యక్షుడు ఎస్.నీలకంఠం, రైతులు సవర పెద్దశ్యామ్, సవర పీతాంబరం, సవర దేవ, మనసిగ్ కొల్లి, మనసిగ్ దాడు, సవర జరిమయా, సవర సురేష్, సవర డేకరా, సవర మనికో, సవర భీమారావు, సవర గోపి, సవర దుర్యోధన, సవర తిరుపతి, పైకొ బొనమాళి, సవర లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

# 5న జాతీయ లోక్ అదాలత్

**-జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా**

**-జిల్లాలోని ఇన్సూరెన్స్ కంపెనీ న్యాయవాదులు, కంపెనీలతో సమావేశం**

**శ్రీకాకుళం, జూన్ 30(వార్త):** యాక్సిడెంట్ కేసుల ఇన్సూరెన్స్ కంపెనీలు రానున్న లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజి చేయమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. స్థానిక జిల్లా కోర్టు భవనం నందు ఇన్సూరెన్స్ న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెనీలతో సోమవారం జిల్లా కోర్టు భవనం నందు సమావేశము ఏర్పాటు చేశారు. ప్రజలకు న్యాయం చేకూర్చే విధంగా న్యాయవాదులు ఇన్సూరెన్స్ కంపెనీలు ఇరువురు ఒకచోట కూర్చుని ఇరువురికి న్యాయం చేకూర్చేలా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఒకటవ అదనపు జిల్లా జడ్జి పి భాస్కర రావు, 3 వ అదనపు జిల్లా జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్, 4 వ అదనపు జిల్లా జడ్జి ఎస్ ఎం ఫణి కుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం శ్రీధర్, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులు పాల్గొన్నారు.




## హెున్నాలి పాఠశాలను సందర్శించిన డీఈఓ

**మందస, జూన్ 30(వార్త):** గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తగు న్యాయం చేయాలని యూటీఎఫ్ జిల్లా శాఖ వారు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమల చైతన్యను కలసి వినతిపత్రం అందజేశారు. సోమవారం డీఈవో.. హెున్నాలి ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సమయంలో పెద్ద ఎత్తున గ్రామస్థులు హాజరై డీఈవోకి తమ పాఠశాలను పరిరక్షించాలని, తామే ఉపాధ్యాయులను నియమించుకుని, పాఠశాలను నడుపుకుంటామన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు, జిల్లా కార్యదర్శి గున్న రమేష్, రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్ బడిత్య, దాసరి ఈశ్వరరావు, మండల పూర్వపు ప్రధాన కార్యదర్శి సార భాస్కరరావు డీఈవోని కలిసి తగు న్యాయం చేయాలని కోరారు.



## సరుబుజ్జిలి- ఏబీ రోడ్డు గోతులమయం

**-నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న నేతలు, అధికారులు**

**-ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, స్థానికులు**



**(సరుబుజ్జిలి)**

అలికాం - బత్తిలి (ఏబీ) ప్రధాన రహదారిపై చెరువులను తలపించే గోతులు దర్శనమిస్తున్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు చేరి చెరువుల్ని తలపిస్తున్నాయి. సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్ నుంచి గోనెపాడు రోడ్డు వరకు పెద్ద, పెద్ద గోతులు ఏర్పడడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. నేతలు, అధికారులు స్పందించి గోతులను పూడ్చాలని ప్రయాణికులు, స్థానికులు కోరారు.

## విద్యారంగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం



**కొత్తూరు, జూన్ 30 (వార్త):** కూటమి ప్రభుత్వం విద్యా రంగంలో సంస్కరణల పేరుతో తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు విద్యా ప్రమాణాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆవేదన వ్యక్తం చేశారు. బలమైన, సమర్థవంతమైన విద్యావ్యవస్థే సమాజానికి పునాది అని, దీనిని నిర్లక్ష్యం చేయడంతో భవిష్యత్ తరాలకు తీవ్రంగా నష్టం కలుగుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆపి, వారికి మెరుగైన విద్యను అందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయా లని.. లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రుల పక్షాన వైసీపీ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమం పక్కన పెట్టి ఇసుక దందాలు, మద్యం వ్యాపారాలు, అక్రమార్జనకు మాత్రమే ధ్యేయంగా పాలిస్తుందన్నారు. తక్షణమే ఈ అక్రమ దందాలను ఆపి, ప్రజల సంక్షేమంపై దృష్టి సారించాలని హితవు పలికారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## రైల్వే ఎంక్వైరీ కౌంటర్ మార్పు

**ఇచ్ఛాపురం, జూన్ 30(వార్త):**కొత్తగా ఎంక్వైరీ కౌంటర్ బుకింగ్ కౌంటర్ పక్కనే ఏర్పాటు చేస్తున్నట్లు సి బి ఎస్ రమణ చెప్పారు. ఎంక్వయిరీ కౌంటర్ విషయం సి బి ఎస్ రమణ సిబిఎస్ జిఎం దృష్టి కి తీసుకెళ్లడం తో ఈ మార్పు చేశారు.సిబ్బంది అందుబాటులో ఉంటారని, అందరూ దయవుంచి బుకింగ్ ఆఫీస్ పక్కనే ఏర్పాటు చేసిన ఎంక్వైరి కౌంటర్ లో ఎంక్వయిరీ చేసుకుని రైల్వే సేవలు పొందాలని చెప్పారు.





## మందసకు వంశధార జలాలు అందివ్వాలి

**మందస, జూన్ 30(వార్త):**వంశధార కాలువను పొడిగించి మందస భూములకు సాగునీరు అందించాలని పలాస డివిజన్ వంశధార జనసాధన కమిటీ నాయకులు గ్రీవెన్స్‌లో కలెక్టరుకు వినతిపత్రం అందించారు. వంశధార జనసాధన కమిటీ అధ్యక్షుడు మార్పు మన్మథరావు, ఉపాధ్యక్షుడు ధర్మార్పు వెంకట్రావు మాట్లాడుతూ కొన్నేళ్లుగా వర్షాధారమే తప్ప.. శాశ్వత సాగునీటి వనరులు లేనందున పలు గ్రామాల్లో పంట పండే సమయంలో సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయ న్నారు. తమ పరిస్థితిని అర్థం చేసుకొని తగు నిధులు కేటాయించి వంశధార నీటిని భూములకు అందించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో నల్ల హడ్డి, హేమారావ్ చౌదరి, మహేంద్ర రైతు సంఘం అధ్యక్షుడు బెస్త కామేశ్వరరావు, చైతన్య రైతు సంఘం అధ్యక్షుడు మామిడి మాధవరావు, ఉద్దానం రైతు సంఘం ప్రతినిధులు తామాడ త్రిలోచనారావు, దాసరి శ్రీరాములు, దుంపల వైకుంఠరావు, కొర్నాన గంగాధర్, కొవ్వూరు దశరథ, గొర్రెల అంజి తదితరులు పాల్గొన్నారు.

## 19న మందస హైస్కూలు జీటీ-125 మహోత్సవం



**మందస, జూన్ 30(వార్త):** మందసలోని శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీటీ-125 మహోత్సవం ఈ నెల 19న నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ తెలిపింది. ఆ పాఠశాల పునఃనిర్మాణ భవనాలను 19న(శనివారం) 10గంటలకు పునఃప్రారంభిస్తామని కమిటీ ప్రతినిధులు తెలిపారు. 20న(ఆదివారం) పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సమ్మేళనం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించబడుతుందన్నారు. అన్ని బ్యాచ్లకు చెందిన పూర్వ విద్యార్థినీ, విద్యార్థులు, పాఠశాల శ్రేయోభిలాషులు తప్పక పాల్గొని, కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

## అలరించిన శాస్త్రీయ సంగీత గాత్ర కచేరి




**ఇచ్ఛాపురం, జూన్ 30(వార్త):** ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవం జగన్నాథ స్వామి రథయాత్రలో రెండో రోజు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మహతి కళా సంస్థ వ్యవస్థాపకులు వయోలిన్ తిప్పన ధనుంజయ రెడ్డి, గాత్రం ధూట్ల వెంకటేశం గౌనప. చందనం మృదంగంపై తమ సహకారాన్ని అందించారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మణికంఠ భక్తి రంజని కళాకారులు వీనులకు విందుగా చక్కని పాటలను పాడి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. సీహెచ్ అమృత వర్షిని వయోలిన్ ఎంతగానో ప్రేక్షకులను ఆకర్షించింది. సర్వ దేవతల భక్తి గీతాలు ఒరియా జగన్నాథ స్వామి భజన్స్ కళాకారులు ఆలపించి భక్తుల మదిలో మంచి స్థానం సంపాదించారు. గాత్రంపై మణికంఠ పట్నాయక్, కీబోర్డుపై హరిదాస్, బలపై నారాయణపేడ్స్ సహకారం మోహన్ అందించి చక్కటి లయ విన్యాసాన్ని చూపించారు. ఆలయ అర్చకులతో కళాకారులకు సత్కార కార్యక్రమం జరిపించారు ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## శక్తి యాప్‌పై అవగాహన

**కోటబొమ్మాళి, జూన్ 30(వార్త):** కోటబొమ్మాళిలోని కేజీబీవీ స్కూల్‌లో విద్యార్థినులకు శక్తి యాప్‌పై టెక్కలి శక్తి టీం సభ్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శక్తి టీం ఎస్ఐ బాలకృష్ణ, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.




# బాధ్యతగా రెవెన్యూ సేవలందించండి

**-రెవెన్యూ అంశాల పరిష్కారంలో ప్రగతి స్పష్టంగా కనిపించాలి -విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు - కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**



**పలాస/ శ్రీకాకుళం, జూన్ 30(వార్త):** ప్రజలకు రెవెన్యూ సేవలు అందించడంలో బాధ్యతగా పని చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పలాస రైల్వే గ్రౌండ్ లోని సమావేశ మందిరంలో డివిజన్లోని తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, హెచ్.డి.టీలు, ఆర్ఎస్ డిటీలు, సర్వేయర్లు, వి.ఆర్.ఓలతో రెవెన్యూ అంశాలపై సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాల వారిగా ప్రజా సమస్యల పరిష్కార వినతులు, 22 ఎ నిషేధ భూముల వివరాలు, ఇళ్ల స్థలాల రీ వెరిఫికేషన్, తదితర రెవిన్యూ అంశాల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వచ్చిన వినతులను క్షేత్రస్థాయిలో ఎంత వరకు పరిష్కరించినది, పరిష్కారం చూపవలసినవి మండల గ్రీవెన్స్ మానిటరింగ్ అధికారి శ్రద్ధ వహించాలని ఆదేశించారు. వినతులు పరిష్కారం కాని కారణాన్ని ఎండాస్మెంటులో ఫిర్యాదుదారునికి తెలపాలని సూచించారు. 22 ఎ నిషేధ భూములను గుర్తించి పరిష్కారానికి నివేదిక అందజేయాలని సూచించారు. 22 ఏ ఎటువంటి కేసులు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. ఇండ్ల స్థలాల రీ వెరిఫికేషన్ ను పక్కాగా పూర్తిచేయాలని, ఇండస్థలాల కొరకు ఎన్ని దరఖాస్తులు పెండింగ్లో ఉన్నవి, అందుబాటులో ఉన్న భూమి వివరాలను సిద్ధం చేయాలని తాసిల్దార్లను ఆదేశించారు. రీ సర్వేలో వచ్చిన డి పట్టా భూములకు 1బి రానటువంటి కేసుల వివరాలను నివేదిక అందజేస్తే ప్రభుత్వానికి పరిష్కారం కోసం సమర్పిస్తామన్నారు. రెవెన్యూ అశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమస్యల పరిష్కారం, ప్రగతిని ఎప్పటికప్పుడు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీవో జి.వెంకటేష్, జిల్లా ఉద్యాన వన అధికారి సీహెచ్.శంకర్ దాసు, జిల్లా సెరీ కల్చర్ అధికారి పి.చంద్ర జీవన్, జిల్లా పర్యాటక శాఖ అధికారి పి.నారాయణ రావు, తహసీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి, డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి

**-జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు**

**-217 అర్జీల స్వీకరణ**



**శ్రీకాకుళం, జూన్ 30(వార్త):** అర్జీలు పరిష్కారానికి క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికలో ఆయన అర్జీదారుల నుండి అర్జీలు స్వీకరించారు. సంబంధిత అర్జీ దారుని వద్దకు క్షేత్రస్థాయిలోకి వెళ్లి మాట్లాడి వారికి నాణ్యమైన సమాచారం అందజేయాలన్నారు. అర్జీలు సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్వీకరించిన అర్జీలలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, డ్వామా, మహిళా శిశు సంక్షేమం, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పంచాయతీ, ఎపిఈపీడిసియల్, సర్వే, భూగర్భ గనులు, ఇరిగేషన్, తదితర శాఖల సమస్యల పై 217 అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరణలో డిప్యూటీ కలెక్టర్లు పద్మావతి, అప్పారావు, ఐసీడీఎస్ పీడీ బి. శాంతిశ్రీ ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**-ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**

**నరసన్నపేట, జూన్ 30(వార్త):** సుపరిపాలనలో తొలి అడుగు శిక్షణ తరగతులను నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ప్రభుత్వం చేయనున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, నరసన్నపేట, పోలాకి మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, శిమ్మ




చంద్రశేఖర్,గొద్దు చిట్టిబాబు ,జల్లు చంద్రమౌళి, పూతి రమణ, అడపా చంద్రశేఖర్, జామి వెంకట్రావు,భైరి భాస్కరరావు,సూరపు నారాయణదాసు, కరుకోల రమేష్‌బాబు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు క్లస్టర్, యూనిట్ ఇన్చార్జులు, రాష్ట్ర, జిల్లా,మండల అనుబంధ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## స్టేట్ బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం

**ఇచ్ఛాపురం, జూన్ 30(వార్త):** వీకే పేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్‌లో 70వ వ్యవస్థాపక దినోత్సవంల ఘనంగా నిర్వహించారు. చీఫ్ మేనేజర్ సుకాంత్‌కుమార్ సాహు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. బ్యాంకింగ్ రంగంలో 219 ఏళ్లుగా సేవలు అందిస్తూ స్టేట్ బ్యాంక్‌గా రూపాంతరం చెందాకా 70 ఏళ్ళు పూర్తి చేసుకుంది అని అన్నారు. కార్యక్రమంలో సర్వీసు మేనేజర్ సుస్మా బన్వాల్, క్యాష్ ఆఫీసర్ గౌరీ శంకర్, ఫీల్డ్ ఆఫీసర్ భాస్కర్‌రావు, లోకల్ సెక్రటరీ కాయల ప్రసాద్ రెడ్డి, లీలా ప్రసాద్, మురళి తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం తగదు

**- ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి**

**-పోలీసు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ**

**కార్యక్రమానికి 63 వినతులు**



**శ్రీకాకుళం, జూన్ 30(వార్త):** పబ్లిక్ గ్రీవెన్స్ లో స్వీకరించే ప్రజా ఫిర్యాదుల పట్ల జాప్యం, నిర్లక్ష్యం వహించకుండా, త్వరితగతిన ఆయా ఫిర్యాదులపై విచారణ జరిపి అర్జీదారులు సంతృప్తి పొందేలా పూర్తి స్థాయిలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి 63 మంది ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తక్షణమే సంబధిత పోలీసు అధికారులకు తెలియ పరిచి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు. పిర్యాదులు వివరాలు మొత్తం 63 స్వీకరించగా అందులో కుటుంబ సమస్యలు, మోసపూరితమైన, ఆస్తి తగాదాల,సివిల్, ఇతరత్రా అంశాలపై స్వీకరించాను.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... సుమారు 35 ఏళ్ళు పోలీసు ఉద్యోగులు గా ప్రజలకు నిస్వార్ధమైన సేవలు అందించిన వారికి సమాజం లోఎప్పుడూ గౌరవం లభిస్తుందని జిల్లా ఎస్పీ కొనియాడారు. సర్వీసులో అనేక ఒడిదుడుకులు, ఒత్తిడిలు ఎదుర్కొని అటు ఉద్యోగానికి ఇటు కుటుంబానికి సమాన తూకంగా వేసుకొని క్రమశిక్షణతో విధులు నిర్వర్తించడం అనేది చాలా గొప్ప విశేషమని ఎస్పీ తెలిపారు.ఉద్యోగ విరమణ అనంతరం లభించిన ప్రతి ప్రయోజనాన్ని,ప్రతి రూపాయిని ప్రణాళిక బద్ధంగా ఖర్చుచేసి ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. పోలీస్ డిపార్ట్మెంట్ కు చేసిన సేవలను ప్రత్యేకంగా ఎస్పి కొనియాడితు,హృదయపూర్వక పదవి విరమణ శుభాకాంక్షలు తెలియజేసినారు.పదవి విరమణ పొందిన తర్వాత డిపార్ట్మెంట్ పరంగా ఏ అవసరం ఉన్నా సరే స్వయంగా వచ్చి నన్ను నేరుగా కలవచ్చునని ఎస్పి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కెవి రమణ, పరిపాలన అధికారి సి హెచ్ గోపీ నాథ్, డిఎస్పీ ఎల్ శేషాద్రి, ఆర్ఐ కె నర్సింగ రావు,పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్ కృష్ణం నాయుడు,ట్రెజరర్ భుజంగ రావు, జగదాంబ, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# నూకరాజు కుటుంబానికి మాజీ మంత్రి సీదిరి పరామర్శ

**పలాస, జూన్ 30(వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ,2వ వార్డు, సూర్యకోలనికి చెందిన యువకుడు కొవిరి నూకరాజు ఇటీవల బలవర్మరణం చెందిన విషయం తెలుసుకుని మాజీ మంత్రివర్యులు డాక్టర్ సీదిరి అప్పలరాజు సోమవారం వారి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులులకు పరామర్శించి తనప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ మంత్రితో పాటు పట్టణ వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శిష్టు.గోపీ, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు 2వ వార్డు కౌన్సిలర్ ప్రతినిధి బడగల.బల్లయ్య, మునిసిపల్ కో- ఆప్షన్ సభ్యులు బమ్మిడి.సంతోష్ కుమార్, స్థానిక వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బగాది.సింహాచలం కొనారి.అది, పిట్ట.భాస్కరరావు, సోపింటి ఆనంద్, రాజు, చందు హేమంత్, మణి పాల్గొన్నారు.



# శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలి

**-ఎస్పీ మహేశ్వరరెడ్డి -నిస్వార్ధమైన సేవలకు అభినందన -ఉద్యోగ విరమణ చేసిన పోలీసుసిబ్బందికి ఘన సత్కారం**



**శ్రీకాకుళం,, జూన్ 30(వార్త):** సుదీర్ఘకాలం జిల్లా పోలీసు శాఖలో అంచెల అంచెలుగా వివిధ హొదాల్లో ఉద్యోగ విధి నిర్వహణలు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందుతున్న ప్రతి పోలీసు ఉద్యోగి ఉద్యోగ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో శేష జీవితాన్ని గడపాలని జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి ఆకాంక్షించారు.

సబ్ ఇన్స్పెక్టర్లు ఆర్ శంకర్ రావు,(వి. ఆర్) వి నేతాజీ (డి సి ఆర్ బి) ,ఎన్. కృష్ణ రావు (ఎచ్చెర్ల), పి.ఎస్.నారాయణ (విశాఖపట్నం), బి.వి సత్యనారాయణ (శ్రీకాకుళం రూరల్), ఆర్.రవి కుమార్ (వజ్రపు కొత్తూరు), వై నర్సింహులు,బి. రామీ నాయుడు, (డి ఎ ఆర్ ఎచ్చెర్ల) హెడ్ కానిస్టేబుల్స్ కె. మల్లేశ్వరరావు, బి.మాధవ రావు(ఎ.ఆర్),ఆఫీసు స్వీపర్లు బి.గన్నయ, ఎన్. లలిత, హొమ్ గార్డులు ఆది నారాయణ, సూర్య నారాయణ .. 35 సంవత్సరాలుగా పోలీస్ శాఖలో మంచి క్రమశిక్షణతో పనిచేసి అధికారుల ప్రశంసలు అందుకున్నారు.



## పారిశుధ్య పనులను పర్యవేక్షించిన కమిషనర్

**పలాస, జూన్ 30(వార్త):** పారిశుధ్య కార్మికుల ఐదు రోజులుగా చేపడుతున్న సమ్మెను విరమింపజేసి సోమవారం మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు పారిశుధ్య కార్మికులను విధులకు తీసుకువచ్చారు. పలాస, కాశీబుగ్గ జంట పట్టణాలలో శానిటేషన్ పనులను పర్యవేక్షించారు. 13 వ వార్డు తిలక్ నగర్లో రోడ్డు స్వీపింగ్ పనులను పరిశీలించి, పలాస ప్రభుత్వ ఆసుపత్రి మరియు పరిసర ప్రాంతాల్లో ఉన్న శానిటేషన్ పరిస్థితిని సమీక్షించారు. పలాస 24 వ వార్డు కేటి రోడ్డు ఇందిరా చౌకు వద్ద గల డంపర్ బిన్ లో గల గార్బేజ్ ను కాంపాక్టర్ వెహికల్ తో క్లియర్ చేయించారు. తహసీల్దార్ కార్యాలయం రోడ్డు, మొగిలిపాడు రోడ్డు పక్కన గల పిచ్చి మొక్కలను తొలగించే ప్రక్రియను పర్యవేక్షించారు. కాశీబుగ్గ ఓల్డ్ బస్టాండ్ రోడ్లో గల “అన్న క్యాంటీన్” డైలీ ఇన్స్పెక్షన్స్ లలో భాగంగా బ్రేక్ఫాస్ట్ టైములో తనిఖీ చేసి, క్వాలిటీని చెక్ చేసి అన్న క్యాంటీన్లో ఉన్న లబ్ధిదారుల వద్ద నుండి ఫీడ్ బ్యాక్ ను సేకరించారు.

## ఓటర్ల జాబితా తయారీపై వివిధ పార్టీల నేతలతో సమావేశం



**శ్రీకాకుళం, జూన్ 30(వార్త):** శ్రీకాకుళం రెన్యూ డివిజనల్ అధికారి కె.సాయి ప్రత్యూష అధ్యక్షతన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సోమవారం సమావేశం నిర్వహించారు. మంచి ఓటర్లు జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీల వారు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. అన్ని పార్టీ ల వారికి బూత్ లెవెల్ ఏజెంట్స్ జాబితాను ఇవ్వాలని కోరారు. సమావేశంలో శ్రీకాకుళం తహసిల్దార్ ఎస్. గణపతిరావు, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ జి. కె. శ్రీనివాసరావు, మాదారపు వెంకటేష్, జనార్ధన - టీడీపీ, ఆర్.శంకర రావు - వైఎస్ఆర్సిపి, ఆర్.పురుషోత్తం - బిజెపి, బి.అర్జునకుమార్, భాస్కర్‌రావు - జనసేన పాల్గొన్నారు.

## వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల బదిలీలకు ముగిసిన కౌన్సెలింగ్

**శ్రీకాకుళం, జూన్ 30(వార్త):** జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు సోమవారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్‌ను శ్రీకాకుళం అంబేద్కర్ ఆడిటోరియంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూదన రావు పర్యవేక్షణలో నిబంధనల మేరకు సజావుగా నిర్వహించారు. ఐదేళ్లు పూర్తి చేసిన ఉద్యోగులకు బదిలీ అవకాశం కల్పించగా, మొదట విభిన్న ప్రతిభావంతులు, స్పౌజ్ కేటగిరీకి చెందినవారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అభ్యర్థుల నుంచి ఇప్పటికే తీసుకున్న ఆప్షన్లు, ఖాళీల ఆధారంగా సీనియారిటీ పద్ధతిలో ఎంపికలు జరిపారు. మొత్తం 5 సంవత్సరాలు సర్వీసు దాటిన 340 మందికి, అలాగే ఇతరులు 60 మందికి బదిలీల కౌన్సెలింగ్ చేపట్టినట్లు డీడీ తెలిపారు.

## 7, 8 వార్డులో ముందస్తు రేషన్ పంపిణీ

**ఇచ్ఛాపురం, జూన్ 30(వార్త):** మున్సిపాలిటీ పరిధి 7,8 వార్డులకు సంబంధించి ముందస్తు రేషన్ పంపిణీ చేశారు. వృద్ధులు, దివ్యాంగులకు అందజేశారు. వార్డు ఇన్‌చార్జి రంగాల శ్రీనివాస రెడ్డి, కాయ శ్రీనివాసరావు, ఉనా సంతోష్, డీలర్ పొట్ట చంద్రావతి, యోగులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546